RNI No: APTEL /25/A2860

సీమ వార్త సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 23 | పేజీలు : 4 | సోమవారం 27 జూలై 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-



ఆకివీడు రామాలయానికి

# సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్

- ఆకివీడు రామాలయానికి సుప్రీంకోర్టు అనుమతి
- నిర్మాణ వ్యతిరేక పిటిషన్ కొట్టివేత
- కలెక్టర్ ఎన్‌వోసీ చట్టబద్ధమేనని స్పష్టీకరణ
- ప్రభుత్వ భూమిలో నిర్మాణానికి అభ్యంతరం లేదన్న కోర్టు
- న్యాయపరమైన అడ్డంకులు తొలగినట్లు స్పష్టత
- తీర్పును స్వాగతించిన రఘురామ కృష్ణంరాజు

# భారత కరెన్సీపై పదేళ్ల ఆంక్షలకు తెర

- రూ. 500 నోట్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపాల్
- భారత కరెన్సీపై ఆంక్షలు సడలించిన నేపాల్
- రూ. 200, రూ. 500 నోట్ల వినియోగానికి అనుమతి
- రూ. 25,000 వరకు తీసుకెళ్లేందుకు అవకాశం
- భారత పర్యాటకులు, వ్యాపారులకు పెరగనున్న సౌలభ్యం
- 2016 నోట్ల రద్దు తర్వాత విధించిన నిబంధనలకు ముగింపు





# తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం

ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఊరట కలిగిస్తూ పౌర సరఫరాల శాఖ తీసుకున్న నిర్ణయంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఆగస్టు 1వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని విక్రయించనున్నట్లు ప్రకటించారు. బహిరంగ మార్కెట్లో విపరీతంగా పెరుగుతున్న ధరల నుంచి సామాన్యులను కాపాడేందుకు, ఏపీ ప్రజలకు అండగా నిలిచేందుకే కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. ఈ నిర్ణయం అమలు కోసం పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారంటూ పవన్ కల్యాణ్ కొనియాడారు. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 130 రైతుబజార్లు, 500 రైస్ మిల్లర్ల ప్రత్యేక కౌంటర్ల ద్వారా ఈ బియ్యాన్ని అందుబాటులో ఉంచనున్నారు.

ధరల వివరాలు: బీపీటీ సూపర్ ఫైన్ బియ్యం: కేజీ రూ. 52

గ్రేడ్–1 పచ్చి బియ్యం (రా రైస్): కేజీ రూ. 50

బహిరంగ మార్కెట్ ధరలపై అత్యవసరంగా సమీక్షించి, రైస్ మిల్లర్లతో మాట్లాడి ప్రజలకు అందుబాటు ఉండేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు డిప్యూటీ సీఎం ఆఫీస్ ఎక్స్ వేదికగా స్పష్టం చేసింది. ప్రభుత్వ తీరు సామాన్యుల ఆర్థిక భారాన్ని గణనీయంగా తగ్గిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఏపీ రైతులకు గుడ్‌న్యూస్

పంట బీమా బకాయిల విడుదలకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

ఖరీఫ్–2024 పంట బీమా బకాయిల విడుదలకు కేంద్రం పచ్చజెండా

రాష్ట్ర ప్రభుత్వ హామీతో బీమా బకాయిల విడుదలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్న అచ్చెన్నాయుడు

ఇందుకు సహకరించిన కేంద్రం, శివరాజ్‌సింగ్‌కు కృతజ్ఞతలన్న మంత్రి



ఏపీకి సంబంధించిన పంట బీమా బకాయిల విడుదలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్?సిగ్నల్ ఇచ్చిందని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. వైఎస్సార్సీపీ పాలనలో పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.1900 కోట్ల పంటల బీమా ప్రీమియాన్ని రాష్ట్ర ప్రభుత్వం విడతలవారీగా చెల్లిస్తామని కేంద్రానికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. దీంతో ఖరీఫ్–2024 పంటల బీమా బకాయిలను విడుదల చేసేందుకు కేంద్రం పచ్చజెండా ఊపిందని వెల్లడించారు. ఇటీవల కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిసినట్లు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైతుల సమస్యలను వివరించి, పెండింగ్ బీమా నిధుల విడుదలకు ఏపీ సర్కార్ తీసుకుంటున్న చర్యలను వివరించినట్లు చెప్పారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. కేంద్రం నుంచి ఖరీఫ్–2024 పంటల బీమా నిధులు విడుదలైన వెంటనే అర్హత కలిగిన అన్నదాతల ఖాతాల్లో నేరుగా జమ కానున్నాయని పేర్కొన్నారు. అన్నదాతల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చర్యలు చేపడుతు న్నామని అచ్చెన్నాయుడు వెల్లడించారు. వైఎస్సార్సీపీ పాలనలో పేరుకుపోయిన సమస్యలకు కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా పరిష్కారం చూపుతూ, రైతులకు అందాల్సిన ప్రయోజనాలు సకాలంలో అందేలా చిత్తశుద్ధితో పనిచేస్తోందని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. అన్నదాతల సమస్యలపై సానుకూలంగా స్పందించి బీమా నిధుల విడుదలకు సహకరించిన కేంద్రానికి, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అచ్చెన్నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతుకు ప్రతి ఏటా ఏదో ఒక రూపంలో ముప్పు వెంటాడుతూనే ఉంటోంది. వరదలు, తుపానులు, తెగుళ్లు నట్టేట ముంచుతున్నాయి. ఈ క్రమంలోనే కేంద్రం ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకం (పీఎంఎఫ్‌బీవై) తీసుకొచ్చింది. సాగు చేసిన పంటల వారీగా రైతు తన వాటా ప్రీమియాన్ని చెల్లిస్తే బీమా వర్తిస్తుంది.

# బాబోయ్!

ఏం కొనేటట్టులేదు..

ఈ ధరలేంది బాబోయ్!

పెరుగుతున్న ధరల నేపథ్యంలో సమాన్యుడు ఎప్పుడేం జరగుతుందో తెలియక కంగారు పడుతున్నాడు.



వరుణుడు ముఖం చాటేశాడు. జులై నెలాఖరుకు వచ్చినా వాన జాడ కానరావడం లేదు. వాన దేవుడు అప్పుడప్పుడు చుట్టం చూపుగా వచ్చి నాలుగు చినుకులు రాల్చి మమా అనిపించేస్తున్నాడు. ఈ ఏడాది వానలకు కనీసం భూమి కూడా తడవలేదు. వాన పడితే చేలో విత్తాలని రైతు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నాడు. ఆశలు చావడం లేదు. ఆగస్టులోనైనా వాన సమృద్ధిగా పడుతుందేమోనని గంపెడు ఆశలతో ఆకాశం వైపు చూస్తున్నారు. ఈ క్రమంలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశానికి ఎగబాకుతున్నాయి..



## యుద్ధ విరామంతో దిగొచ్చిన చమురు ధరలు

- ఒక్కరోజే 7 శాతం పతనం
- అమెరికా–ఇరాన్ ఉద్రిక్తత తగ్గడంతో చమురు ధరల పతనం
- బ్రెంట్, డబ్ల్యూటీఐ ధరలు ఏడు శాతం వరకు తగ్గుదల
- దౌత్యపరమైన పరిష్కారంపై మార్కెట్‌లో ఆశలు
- ఇంకా పూర్తిగా తొలగని సరఫరా అంతరాయ భయాలు
- చమురు పతనంతో రూపాయికి భారీ ఊరట

150 ఏళ్లలో ఎన్నడూ లేని

# కరవు నెలకొంది

- పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరిగాయన్న తుమ్మల
- దీని కారణంగా రుతుపవనాల జాడ లేకుండా పోయిందని వెల్లడి
- వచ్చే నెలలో కురిసే వర్షాలు మెట్ట పంటలకు మాత్రమే ఉపయోగపడతాయన్న మంత్రి



ప్రపంచంపై ప్రకృతి తీవ్రంగా దాడి చేస్తోందని తెలంగాణ వ్యవసాయం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. గత 150 సంవత్సరాలలో ఎన్నడూ చూడని తీవ్ర కరవు పరిస్థితులు కనిపిస్తున్నాయని తెలిపారు. పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరగడం వల్ల దేశానికి రావాల్సిన నైరుతి రుతుపవనాల జాడ లేకుండా పోయిందని, దాంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. దీని ప్రభావం వచ్చే మార్చి, ఏప్రిల్ నెలల వరకు ఉండే అవకాశం ఉందని, రాబోయే రోజుల్లో సరైన వర్షాలు కురవవని ఐఎండీ మరియు అంతర్జాతీయ వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారని పేర్కొన్నారు. వచ్చే నెలలో కురిసే స్వల్ప వర్షాలు కేవలం మెట్ట పంటలకు మాత్రమే ఉపయోగపడతాయని, ప్రస్తుత పరిస్థితుల్లో వరి సాగు చేయడం చాలా కష్టతరమని స్పష్టం చేశారు. నీటి లభ్యత తక్కువగా ఉన్నందున రైతులు తక్కువ సమయంలో, తక్కువ నీటితో పండే పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజలు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా, రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా తీర్చిదిద్ది రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. మార్కెట్ కమిటీల పనితీరును పరిశీలించేందుకు 6 ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశామని, ఇవి వారం రోజుల పాటు తనిఖీలు నిర్వహిస్తాయని తెలిపారు.

సోమవారం 27 జూలై 2026

సీమ వార్త
సాయంకాలం

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

# పదోన్నతి పొందిన అడిషనల్ ఎస్పీ మహేష్‌కు సన్మానం

సత్కరించిన....బలిజ నేతలు, ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ పిఆర్ఓ జగదీష్, టిడిపి వాణిజ్య విభాగం ఇన్చార్జ్ రజిని



**హిందూపురం జులై 27 సీమ వార్త సాయంత్రం.**

హిందూపురం డిఎస్పీగా విధులు నిర్వహిస్తూ ఇటీవలే అడిషనల్ ఎస్పీగా ప్రమోషన్ పొందిన మహేష్ ను హిందూపురం బలిజ సంఘ నేతలు, ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ పిఆర్ఓ జగదీష్, తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం ఇన్చార్జి రజిని లు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ కార్యాలయంలో జగదీష్ మరియు రజిని లు అడిషనల్ ఎస్పీ మహేష్ ను కలిసి అభినందిస్తూ శాలువాలతో సన్మానించి పూల బొకే ను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## రైతులపై... దయ చూపండి సుబ్రహ్మణ్యేశ్వరా!



పంపనూరులో వరుణ హోమం.. సహస్ర ఘటాభిషేకం

హోమం, పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పరిటాల సునీత

పవిత్రజలాలతో స్వామి వారికి అభిషేకం

వర్షాలు కురిసి ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి ఎమ్మెల్యే సునీత ఆకాంక్ష

**అనంతపురం జూలై 27 సీమ వార్త సాయంత్రం.**

అనంతపురం జిల్లాలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పంపనూరు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో అత్యంత భక్తి శ్రద్దలతో, శాస్త్రోక్తంగా వరుణయాగం నిర్వహించారు. గత కొన్ని రోజులుగా ఎల్-నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పంపనూరు క్షేత్రంలో "వరుణహోమం" - "సహస్ర ఘటాభిషేకం" నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యేకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దేవాలయం నుంచి పవిత్ర జలాలను తీసుకొని గ్రామ బొడ్డు రాయి - మిగతా3లో





## పరిశ్రమ ప్రోత్సాహంతో..... హాస్టళ్లకు కలర్ టెలివిజన్లు..!!

.....సంక్షేమ వసతి గృహాలకు...కెవిస్ హెచ్ కంపెనీ సాయం.

.....కలెక్టర్ చేతుల మీదుగా టీవీలు పంపిణీ.







**పుట్టపర్తి జూలై 27 సీమ వార్త సాయంత్రం.**

సోమవారం రేవెన్యు భవన్ నందు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ స్కీమ్‌లో భాగంగా ఆటోమోటివ్ ప్రైవేట్ లిమిటెడ్ (పెనుగొండ) సంస్థ జిల్లాలోని 25 కళాశాల వసతి గృహాలకు లైబ్రరీ ర్యాక్స్, 20 టీవీలను సమకూర్చింది. ఇందులో భాగంగా సోమవారం ఉదయం ధర్మవరం, పెనుగొండ డివిజన్లలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల పరిధిలోని 10 వసతి గృహాలకు 43 ఇంచుల స్మార్ట్ టీవీలను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సంబంధిత అధికారులకు అందజేశారు. విద్యార్థుల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధికి సహాయం అందించిన కేఎఫ్సి హెచ్ ఆటోమోటివ్ యాజమాన్యానికి ఈ సందర్భంగా కలెక్టర్ అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమములో జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్,బిసి సంక్షేమం అధికారి రాజేంద్ర కుమార్ రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

....మై భారత్ పై యువతకు అవగాహన కల్పించాలి.

అనంతపురంలో...జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్







**అనంతపురం ,జూలై 27 సీమ వార్త సాయంత్రం.**

నేటి యువతభాగస్వామ్యం మన దేశ అభివృద్ధిలోఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవన్ లో భారత ప్రభుత్వం మరియు యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మై భారత్ జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువతకు మై భారత్ కార్యక్రమాలపై విస్తృతంగా అవగాహన కల్పించే విధంగా ప్రభుత్వ శాఖలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మరి ముఖ్యంగా విద్యా, సంక్షేమ, క్రీడా, ఎన్ఎస్ఎస్, జిల్లా ప్రజా పరిషత్, డిపిఓ, ఎస్ ఎస్ ఏ, ఆన్ సెట్ తదితర శాఖ అధికారులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. మై భారత్ కార్యక్రమాలను గ్రామస్థాయి నుండి మొదలుకొని కళాశాలల వరకు విస్తృతంగా తీసుకెళ్లి యువతలో అవగాహన పెంపొందించాలని తెలిపారు. యువత దేశ నిర్మాణంలో భాగస్వాములు కావడానికి మై భారత్ వేదికగా నిలుస్తోందని జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు విద్యాసంస్థలు స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పని చేయాలని పేర్కొన్నారు. 2026 -27 సంబంధించి జిల్లాలోమైభారత్ఆధ్వర్యంలో నిర్వహించ నున్న వార్షిక కార్యచరణ ప్రణాళిక యువ జన కార్యక్రమాలు, నైపు ణ్యాభివృద్ధి ,స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ ,విపత్తు నిర్వహణ శిక్షణలో సామాజిక సేవ, రిజిస్ట్రేషన్ ప్రక్రియ తదితర కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించి ఈ సందర్భంగా కార్యాచరణను జిల్లా కలెక్టర్ రూపొందించిపలుఆదేశాలుసూచనలు జారీ చేశారు. అనంతరం మైభారత్ ప్రచార సామాగ్రి పోస్టర్ల స్టిక్కర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలోజిల్లా జాయింట్ కలెక్టర్ సి .విష్ణు చరణ్ , డిఆర్ఓ మాలోల యువజనఅధికారి ఐశయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్ , మల్లికార్జున రెడ్డి, పద్మావతి, కిరణ్మయి ,డి ఐ పి ఆర్ ఓ బాల కొండయ్య,మై భారత్ కోఆర్డినేటర్ బిసాటి భరత్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత బి సాటి జీవన్ కుమార్, జయ మారుతి, వాలంటీర్లుఅంబరీష్ ,సాయి కార్తీక్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. జి.మమత, ఆన్ సెట్ మేనేజర్ శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో..... అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

....అందిన ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలు....జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్

**పుట్టపర్తి,జూలై,27 సీమ వార్త సాయంత్రం.**





ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని బాధ్యతాయుతంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రా+=హా) కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులను కలెక్టర్ స్వీకరించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వినతులను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిశీలించి అర్హత మేరకు పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని, వాటి ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో నేడు మొత్తం 332 అర్జీలు రాగా వాటిపై తగు చర్య తీసుకొని పరిష్కరించు నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ఎండార్స్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్, డీఆర్ఓ కొండయ్య,ఎస్‌డిసి విజయ కుమారి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీమ వార్త సాయంకాలం

సోమవారం
27 జూలై 2026

# డీఎస్సీ అక్రమాలపై విచారణ జరిపించాలి

....పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలి.
....నిద్యోగులకు 3000 రూపాయలు నిరుద్యోగ భృతి ఇవ్వాలి.
...రేపు పుట్టపర్తి లో జరిగే ర్యాలీని జయప్రదం చేయండి.
....వల్లం రాజేంద్ర యాదవ్ వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి




**పుట్టపర్తి జులై 27 సీమ వార్త సాయంత్రం.** రాష్ట్రంలోని కుటుంబ ప్రభుత్వం మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను మోసం చేసిందని ఉద్యోగాల భర్తీలో భారీగా అవినీతి అక్రమాలు జరిగాయని వైయస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లం రాజేంద్ర యాదవ్ విమర్శించారు. స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైయస్సార్ విద్యార్థి భాగం పట్టణ అధ్యక్షుడు నిఖిల్ రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వల్లం రాజేంద్ర యాదవ్ మాట్లాడుతూ నీట్ లీకేజీ వ్యవహారంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు యువకులు పోరాటాలు నిర్వహించడంతో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందించి రాజీనామా చేశారన్నారు. మరి రాష్ట్రంలో నిర్వహించిన డీఎస్సీలో అక్రమాలు జరిగాయని సోషల్ మీడియాలో ఫోన్ సంభాషణ వైరల్ అవుతున్న వాటి మీద ఎటువంటి స్పందన కూడా లేకపోవడం దుర్మార్గమని తీవ్రంగా ధ్వజమెత్తారు. ఈ ఆరోపణల పైన వెంటనే సిబిఐ విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విధంగా విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు దాదాపు 9400 కోట్లు ఇవ్వకుండా మోసం చేసిందని దానివల్ల విద్యార్థులకు కళాశాలలో కోర్సు పూర్తయిన సర్టిఫికెట్లు ఇవ్వకుండా కాలేజీ యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. యువగలం పాదయాత్రలో ఎన్నికల హామీలో భాగంగా నిరుద్యోగులకు 3000 రూపాయలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వము వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు నిరుద్యోగ భృతి ప్రకటించకుండా నిరుద్యోగులను మోసం చేస్తున్నారని అన్నారు . ఈ అక్రమాలకు బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉద్యోగాల కల్పన ఫీజు రియంబర్స్మెంట్ నిరుద్యోగ భృతి వంటి కీలక అంశాలలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విద్యార్థులు యువత సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లే వేదికగా రేపు పుట్టపర్తి లో జరగబోయే నిరసన ర్యాలీ నిలుస్తుందని పేర్కొన్నారు. కావున విద్యార్థుల భవిష్యత్తు, యువత హక్కుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యార్థి యువజన వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ ఈ ఉద్యమంలో చేయి చేయి కలిపి నిరసన ర్యాలీలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అనిల్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యుడు సోమేష్ కుమార్, వైయస్సార్ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు షాహిద్ ఖాన్, కదిరి పట్టణ ఉపాధ్యక్షులు రోషన్, మయాన బాబ్జాన్, బాబా విద్యార్థులు పాల్గొన్నారు.

# రుణాల మాఫీ పథకాన్ని ప్రతి రైతు ఫ్యామిలీకి వర్తింప చేయాలి

## మాజీ ఎంపీ.డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి.



**ధర్మవరం జులై 27 సీమ వార్త సాయంత్రం.** మాజీ ఎంపీ (రాజ్యసభ)శ్రీ తులసి రెడ్డి ధర్మవరం నియోజకవర్గం పర్యటన సందర్భంగా ఘనంగా స్వాగతం పలికిన కాంగ్రెస్ పార్టీ నాయకులు తుంపర్తి పరమేష్ , నిసార్ అహమ్మద్.. తులసి రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రుణాల మాఫీ పథకాన్ని కేవలం అమరావతి రైతులకు మాత్రమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులందరికీ వర్తింపజేయాలని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ధర్మవరంలో తులసి రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడు తూ రాష్ట్రవ్యాప్తంగా రైతుల పరిస్థితి చాలా దుర్భరంగా ఉందని,వ్యవసాయం గిట్టుబాటు కాక వ్యవసాయము దండుగ అనే పరిస్థితి నెలకొని ఉంది అన్నారు. పంట పండించడం ఒక ఎత్తు అయితే దాన్ని మార్కెటింగ్ చేసుకోవడం, అమ్ముకోవడం మరొక ఎత్తు అయింది అన్నారు. ఏ పంటకు గిట్టుబాటు ధర లభించడం లేదు. తోతాపురి మామిడి, మిర్చి, పొగాకు, పసుపు, అరటి, చీని, ఉల్లి, టమోటో, బుడ్డ శనిగ ఇలా ఏ పంటకు కూడా గిట్టుబాటు ధర లభించడం లేదు. అడిగే వారు లేరు, కొనేవారు లేరు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కొనుగోలు కేంద్రాలు తెరవకుండా నిమ్మకు నీరెత్తినట్లు ఉలుకు పలుకు లేకుండా పడి ఉన్నాయి. పంటల బీమా అమలు కావడం లేదు.. పంట నష్టపరిహారం సకాలంలో అందడం లేదు. సున్నా వడ్డీ పథకానికి సున్నం పెట్టడం జరిగింది. పావలా వడ్డీ పథకానికి పాడె కట్టడం జరిగింది.డ్రిప్ ఇరిగేషన్ అంతంత మాత్రమే. లేనిపోని యాపులు పెట్టి సకాలంలో రైతులకు ఎరువులు అందడం లేదు. పొలాల్లో ఉండాల్సిన రైతులు ఎరువుల అంగళ్ళ చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు అని తెలిపారు. ఎరువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి అని.ఈ ఆరు నెలల కాలంలోనే ఒక్కొక్క 50 కేజీల బస్తా మీద 500 రూపాయల నుంచి 800 రూపాయల వరకు ధర పెరిగింది అని,.రైతులు ట్రాక్టర్లకు వాడే డీజిల్ ధర పెరిగింది అని,ఈ పరిణామాల కారణంగా రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు.ఆ ఊబి నుండి బయటకు రాలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆత్మహత్యల్లో జాతీయస్థాయిలో ఆంధ్రప్రదేశ్ మూడవ స్థానంలో ఉండడం గమనార్హం అని తెలిపారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ రుణాల మాఫీ ఒక్కటే రైతును ఆదుకుంటుంది అని,అమరావతిలో రెండవ విడత భూ సమీకరణ కోసం భూములిస్తున్న ఏడు గ్రామాల పరిధిలోని రైతులకు ఒక్కొక్క కుటుంబానికి ఒకటిన్నర లక్షల రూపాయల వరకు రుణాలు మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది అని.ఆ నిర్ణయాన్ని ఆ ఏడు గ్రామాల పరిధిలో ఉన్న రైతు కుటుంబాలకే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రైతు కుటుంబాలకు వర్తింపజేయాలని,ప్రతి రైతు కుటుంబానికి లక్షన్నర రూపాయలు వరకు వ్యవసాయ రుణాలు మాఫీ చేయాలని తులసి రెడ్డి కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి డెలిగేట్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నిస్సార్ అహ్మద్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పరమేష్, పెద్దిరాజు, పతి,అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న,,ఐచర్ రమణ, చిన్న కోట్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# బాబోయ్!

హైదరాబాద్

బియ్యం, ఉప్పు, పప్పులతోపాటు కూరగాయలు, పండ్ల ధరలు పెరుగుతున్న ధరల నేపథ్యంలో సమాన్యుడు ఎప్పుడేం జరగుతుందో తెలియక కంగారు పడుతున్నాడు. ఈ నేపథ్యంలో కూకట్‌పల్లి మోడ్రన్ అండ్ మోడల్ రైతు బజార్ జూలై 27కు సంబంధించిన తాజా కూరగాయల ధరల జాబితాను విడుదల చేసింది. టమాటా, ఆలుగడ్డ, దోసకాయ వంటి రోజువారీ అవసరమైన కూరగాయలు తక్కువ ధరకే లభిస్తున్నా.. వెల్లుల్లి, ఎండు మిర్చి, అల్లం వంటి కొన్ని వస్తువుల ధరలు మాత్రం దడ పుట్టిస్తున్నాయి.

టమాటా, ఆలుగడ్డ ధరలు ఎంత?

రైతు బజార్‌లో టమాటా కిలో రూ.18, ఆలుగడ్డ కిలో రూ.18గా విక్రయిస్తున్నారు. అలాగే దోసకాయ, సొరకాయ కిలో రూ.15 మాత్రమే ఉండటంతో వినియోగదారులకు ఊరటనిస్తోంది.

ఇతర ముఖ్యమైన కూరగాయల ధరలు ఎలా ఉన్నాయంటే..

వంకాయ కిలో ధర: రూ.23
బెండకాయ కిలో ధర: రూ.35
పచ్చిమిర్చి కిలో ధర: రూ.37
బజ్జి మిర్చి కిలో ధర: రూ.50
కాకరకాయ కిలో ధర: రూ.32
బీరకాయ కిలో ధర: రూ.38
క్యాబేజీ కిలో ధర:రూ.21
క్యారెట్ కిలో ధర: రూ.41
కాలీఫ్లవర్ కిలో ధర: రూ.25
దొండకాయ కిలో ధర: రూ.35
చిక్కుడుకాయ కిలో ధర: రూ.65
గోరుచిక్కుడు కిలో ధర: రూ.35
బీట్‌రూట్ కిలో ధర: రూ.32
క్యాప్సికమ్ కిలో ధర: రూ.45
కంద కిలో ధర: రూ.45
ఉల్లిగడ్డ కిలో ధర: రూ.32
ఉల్లితొడ కిలో ధర: రూ.55

పండ్లు, మసాలా దినుసుల ధరలు

బొప్పాయి కిలో ధర: రూ.40
ఉసిరి కిలో ధర: రూ.85
పల్లీలు కిలో ధర: రూ.75
ఎండు మిర్చి కిలో ధర: రూ.260
వెల్లుల్లి కిలో ధర: రూ.260
పాత అల్లం కిలో ధర: రూ.200
చింతపండు కిలో ధర: రూ.160
పండు మిర్చి కిలో ధర: రూ.80
కరివేపాకు కిలో ధర: రూ.50
అరటికాయ (ఒక్కటి): రూ.10 నుంచి రూ.11
ముల్లంగి (ఒక్కటి): రూ.6 నుంచి రూ.8
మునగకాయ (ఒక్కటి): రూ.8 నుంచి రూ.10
నిమ్మకాయలు (డజన్): రూ.26 నుంచి రూ.32
మామిడికాయ (ఒక్కటి): రూ.15 నుంచి రూ.20

## భారత రైల్వేలో కొత్త శకం..




భారత రైల్వే చరిత్రలో ఒక కొత్త అధ్యాయం మొదలైంది. దేశీయంగా అభివృద్ధి చేసిన తొలి హైడ్రోజన్ రైలు తన ప్రయోగాత్మక పరుగును విజయవంతంగా పూర్తి చేసింది. 10 కోచ్‌ల ఈ రైలు 1,200 కిలోమీటర్లకు పైగా ప్రయాణించి, ఏకంగా 3,200 లీటర్ల డీజిల్ వినియోగాన్ని ఆదా చేసినట్లు రైల్వే మంత్రిత్వ శాఖ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ రైలు ప్రయాణ సమయంలో కర్బన ఉద్గారాలకు బదులుగా కేవలం నీటి ఆవిరిని మాత్రమే విడుదల చేయడం దీని ప్రత్యేకత. హైడ్రోజన్, ఆక్సిజన్ మధ్య రసాయన చర్య ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుంటూ ఈ రైలు నడుస్తుంది. దీనివల్ల పొగ గానీ, కర్బన ఉద్గారాలు గానీ వెలువడవు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న రైలు రవాణా వ్యవస్థల్లో ఇది అత్యంత పర్యావరణ హితమైనదిగా నిలుస్తోంది. ఈ రైలులో 2,400 కిలోవాట్ల మొత్తం శక్తిని అందించే రెండు హైడ్రోజన్ పవర్ కార్లు, లిథియం ఐరన్ ఫాస్ఫేట్ బ్యాటరీలు, హైడ్రోజన్ సిలిండర్లు ఉన్నాయి. ప్రస్తుతం జింద్ – సోనిపట్ మధ్య ఈ రైలును విజయవంతంగా నడిపారు. త్వరలోనే ఢిల్లీ మార్గంలోనూ దీని ప్రయోగాత్మక పరుగులు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ, ఈ రైలు సాంకేతికత పూర్తిగా స్వదేశీ అని, 'ఆత్మనిర్భర్ భారత్' దార్శనికతకు ఇది నిదర్శనమని అన్నారు. ఈ టెక్నాలజీకి సంబంధించిన మేధో సంపత్తి హక్కులను భారత్ నిలుపుకుందని, భవిష్యత్తులో ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు మార్గం సుగమం అయిందని ఆయన వివరించారు.

## రెండేళ్లలో చేపట్టిన సంక్షేమం అభివృద్ధిపై ఇంటింటా ప్రచార కార్యక్రమం



**లేపాక్షి జూలై 27 సీమ వార్త : సాయంత్రం.** హిందూపురం శాసన సభ్యులు నంద మూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం లేపాక్షి మండలం కోడిపల్లి పంచాయతీ కేంద్రం లో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం పేరుతో ఇంటింటికి ప్రచార కార్యక్రమాన్ని ప్రారం భించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా తెలుగుదేశం పార్టీ హిందూపురం సమన్వయకర్త పావులూరి శ్రీనివాసరావు ,ఎమ్మెల్యే కార్యదర్శి బాలాజీ హాజర య్యారు. కోడిపల్లి పంచాయతీలో గతంలో ఎన్నడూ చేయని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిం దనీ గ్రామ ప్రజలకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లేపాక్షి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అభి లాష్, క్లస్టర్ ఇంచార్జీ మారుతిప్రసాద్, జిల్లా అధికార ప్రతినిధి ఆనంద్, ఎమ్పిటిసి గంగాధర్, రాజశేఖరెడ్డి, జయ కృష్ణ రెడ్డి, నాగ రాజు, వీరశేఖర్, నాగలింగారెడ్డి, సతీష్, గంగిరెడ్డి, అవులరెడ్డి, మంజు, మలక్క, వెంకట లక్ష్మి, నాగమణి, మమతారెడ్డి,అశ్వర్థనారాయణ,లక్ష్మీనారాయణ, మురళి కృష్ణ,హరిజయరమ,జయరామ్, బాబావలి, మూర్తి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## బాలయ్య కోసం పాదయాత్ర...
## అడుగుల్లో అడిగేసిన "పచ్చ" అశోక్.

కదిరి పాదయాత్ర టీంకు... నారా లోకేష్ యువ దళం అండ, దండ.
ఏర్పాట్లు చేసిన... లోకేష్ యువ దళం వ్యవస్థాపకులు పచ్చ అశోక్.






**గోరంట్ల జులై 27 సీమ వార్త సాయంత్రం.** హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ షూటింగ్‌లో గాయపడి చికిత్స పొందుతున్న నేపథ్యంలో, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ హిందూపురం నుంచి కదిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వరకు పాదయాత్ర చేస్తున్న అభిమానులకు సంఘీభావంగా లోకేష్ యువదళం అధ్యక్షులు పచ్చా అశోక్ , సభ్యులు గుమ్మయ్యగారిపల్లి క్రాస్ వద్ద స్వాగతం పలికారు.బాలయ్య బాబు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తూ, పాదయాత్రికులకు ఎంఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో భోజనం, రాత్రి బస ఏర్పాటు చేశారు. అలాగే మండలం ముగింపు వరకు పాదయాత్రలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## రైతులపై... దయ చూపండి సుబ్రహ్మణ్యేశ్వరా....!!

-మొదటిపేజీ తరువాయి

దగ్గరికి ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం బొడ్డు రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి, శ్రీ పరమేశ్వరునికి, శ్రీ పార్వతి అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్ఛారణల మధ్య సహస్ర ఘటాభిషేకం చేశారు. ఆలయంలో వెయ్యి కలశాలతో అభిషేకం చేశారు. పవిత్ర నదీ జలాలు, మంత్రాలతో అభిమంత్రించిన నీటిని వెయ్యి కలశాలలో నింపి.. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి అభిషేకం చేశారు. ఆ తర్వాత లోక కల్యాణం కోసం, వర్షాలు బాగా కురవాలని, దేశం సుభిక్షంగా ఉండాలని వరుణ హోమం నిర్వహించారు. వర్షాలు బాగా కురవాలని, నీటి కటకటలు తొలగిపోవాలని హోమం చేశారు. వేద మంత్రాలు పఠిస్తూ అగ్నిలో నెయ్యి, ధాన్యం, ఇతర ద్రవ్యాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో స్వయంగా పాల్గొని గోపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ రాష్ట్రంలో వర్షాలు బాగా కురవాలని ఆకాంక్షించారు. ఇప్పటికే ఎల్–నినో ప్రభావంతో వర్షాలు సరిగా కురవకపోవడం వలన రైతులు ఆందోళనలు చెందుతున్నారన్నారు. రిజర్వాయర్లలో కూడా నీరు అనుకున్నంత మేర రావడం లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అత్యంత పవిత్రమైన పంపనూరులో వరుణయాగం, సహస్ర ఘటాభిషేకం కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కృప వలన వర్షాలు బాగా కురవాలని.. పంటలు బాగా పండి రైతులు సంతోషంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు.

## కార్గిల్ వీరుల శౌర్యం దేశానికి స్ఫూర్తి'

కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా భారత సాయుధ దళాల వీర జవాన్లకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాళులర్పించారు. దేశ భద్రత కోసం అసాధారణ ధైర్యసాహసాలు, అంకితభావంతో పోరాడిన సైనికుల పట్ల యావత్ దేశం కృతజ్ఞతాభావంతో ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేస్తూ, కార్గిల్ యుద్ధ వీరుల పరాక్రమాన్ని స్మరించుకున్నారు. అత్యంత ప్రతికూల పరిస్థితుల్లోనూ భారత్ భూభాగాన్ని రక్షించేందుకు వారు కనబరిచిన శార్యం దేశానికి గర్వకారణంగా నిలుస్తుందని తెలిపారు. మన మాతృభూమి రక్షణ కోసం తమ ప్రాణాలను అర్పించిన ఆ వీర యోధులకు నివాళులు అర్పిస్తున్నాని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఎక్స్?లో పోస్ట్ చేశారు. వారి సాటిలేని ధైర్యసాహసాలు, అచంచలమైన సంకల్పం, దేశభక్తి భావి తరాలకు నిరంతరం స్ఫూర్తినిస్తూనే ఉంటుందని అన్నారు. వారికి ఎప్పటికీ రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

**భావితరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తి : మోదీ**

"కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా భారత భద్రత కోసం అసాధారణ ధైర్యం, అంకితభావం ప్రదర్శించిన మన వీర సైనికులకు దేశం తన కృతజ్ఞతను తెలియజేస్తోంది. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో వారు కనబరిచిన పరాక్రమం ఎప్పటికీ జాతీయ గర్వానికి ప్రతీకగా నిలుస్తుంది. 1999 కార్గిల్ యుద్ధంలో ప్రాణత్యాగం చేసిన వీర జవాన్ల దేశభక్తి, విధి నిర్వహణలో వారి నిబద్ధత భావితరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తుంది. దేశం కోసం చేసిన వారి త్యాగాన్ని భారత ప్రజలు ఎప్పటికీ మరువలేరు" అని ప్రధాని పేర్కొన్నారు.

మరోవైపు 1999 కార్గిల్ యుద్ధం తర్వాత కూడా చొరబాటుదారుల ఉద్దేశంలో ఎలాంటి మార్పు రాలేదని, ప్రాక్సీ యుద్ధం, చొరబాట్ల వంటి మార్గాల ద్వారా భారత్‌ను అస్థిరపరిచే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.


సీమ వార్త సాయంకాలం

సోమవారం
27 జూలై 2026

# దుర్భిక్ష పర్వం

ఈ ఏడాది వానలు ముఖం చాటేస్తున్నాయి. రైతుల కళ్లల్లో దిగులు మబ్బులు కనిపిస్తున్నాయే గాని, ఎక్కడా చినుకుల సవ్వడి వినిపించడం లేదు. సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవకుంటే, చాలినన్ని తిండి గింజలు పండక కరవు కాటకాలు తప్పవు. అనావృష్టి తెచ్చిపెట్టే కరవు కాటకాలు సామాన్యుల బతుకులను దుర్భరం చేస్తాయి. ప్రధానంగా మనది వ్యవసాయాధారిత దేశం. వ్యవసాయాన్నే నమ్ముకుని, దేశానికి వెన్నెముకగా నిలుస్తున్న కర్షక జనాభా వర్షాభావం వల్ల కష్టాల్లో పడితే, యావత్ దేశానికే కష్టాలు తప్పవు. వర్షాల కోసం క్రమం తప్పక యజ్ఞయాగాదులు చేసే సంస్కృతి మనది. వర్ష ప్రాధాన్యం పట్ల ఎరుక కలిగిన జాతి మనది. 'అనావృష్టి మతీత్యైవ మహతీ వర్షసంతతిః/ భూతానాం సంక్షయం చక్రే దుర్భిక్ష పరిపీడితమ్' అని విష్ణుపురాణం చెబుతోంది. అనావృష్టి వల్ల పంటలు పండక దుర్భిక్షంతో మనుషులే కాదు, సమస్త ప్రాణులూ సంక్షోభానికి, నాశనానికి లోనవుతాయి. కరవు కాటకాలు మన దేశానికి కొత్త కాదు. వానలు లేక, నేల నెర్రెలు పడిన దుర్భర దుర్భిక్ష వర్ణనలు మన పురాణ సాహిత్యం మొదలుకొని ఆధునిక సాహిత్యం వరకు చాలానే ఉన్నాయి. 'అదే పెన్న! అదే పెన్న!/ నిదానించి నడు/ విదారించు నెదన్, వట్టి/ ఎడారి తమ్ముడు!' అంటూ 'పెన్నేటి పాట' రాసిన విద్వాన్ విశ్వం ఒకనాటి రాయలసీమ కరవు దృశ్యాన్ని హృదయ విదారకంగా చిత్రించారు. కరవు కాటకాలను ముందుగా తెలుసుకునే సాంకేతికత ఇదివరకు ఉండేది కాదు. అందువల్ల దుర్భిక్షాన్ని దైవఘటనగానే పరిగణించేవారు. ఇటీవలి కాలంలో సాంకేతిక పెరిగింది. అతివృష్టి, అనావృష్టి పరిస్థితు లను; అల్పపీడనాలు, వాయుగుండాలు, తుఫానుల వంటి ప్రకృతి విపత్తులను ముందు గానే గ్రహించి, వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరికలు చేయగలుగుతున్నారు. పాలకులు బాధ్యతనెరిగిన వారైతే, వాతావరణ శాస్త్రవేత్తల హెచ్చరికలను పట్టించుకుని కార్యాచరణను ప్రారంభిస్తారు. పాలకులు బాధ్యతను మరచి, హాలికులను వారి కర్మానికి వారిని విడిచిపెడితే, దుర్భిక్ష పర్యవసానాలు మరింత దుర్భరంగా ఉంటాయి. ఈసారి 'సూపర్ ఎల్ నినో' పరిస్థితులు ఏర్పడనున్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు వేసవిలోనే హెచ్చరికలు చేశారు. ఈ హెచ్చరికలు ఒకవైపు రైతులలో గుబులు పెంచుతుంటే, మరోవైపు చీకటి వ్యాపారులలో, రాజకీయ దళారులలో, అవినీతిలో మునిగితేలే అధికార గణాల్లో సంబరాన్ని పెంచుతున్నాయి. కరవును కూడా సొమ్ముచేసుకోగల సమర్థులు మనకు కొత్త కాదు. ఇలాంటి దౌర్భాగ్యాన్ని గురించే పాత్రికేయుడు సాయినాథ్ 'ఎవ్రీబడీ లవ్స్ ఎ గుడ్ డ్రౌట్' పుస్తకాన్ని ముప్పయ్యేళ్ల కిందటే రాశారు. 'కృషితో నాస్తి దుర్భిక్షం' అని నేలను నమ్ముకున్న రైతు కలలోనైనా కరవు కాటకాలను కోరుకోడు. రోజువారీ పనులు చేసుకుంటూ అన్నం తిని బతికే సామాన్య ప్రజలు కూడా కరవు కాటకాలను కోరుకోరు. ప్రతి సంక్షోభాన్నీ స్వీయ సంక్షేమ అవకాశంగా మార్చుకొనే దౌర్భాగ్యులే దుర్భిక్షాన్ని కోరుకుంటారు. 'వార్ధుషికః వణిగ్బంధుః యే చ ప్రభూతమన్న సంగ్రహం/ కృత్వా దుర్భిక్షం వాంఛంతి తే పి వార్ధుషికా' అని ప్రాచీన సుభాషిత శ్లోకం చెబుతుంది. వర్తకులకు అధిక వడ్డీలకు అప్పులిచ్చి, జనాలను పీడించే వడ్డీ వ్యాపారులు దేశంలో కరవు కాటకాలు రావాలని కోరుకుంటారని ఈ శ్లోక సారాంశం. ఇప్పటి కాలంలో వడ్డీ వ్యాపారులకు జతగా కార్పొరేట్ ఫైనాన్స్ కంపెనీల నిర్వాహకులు, రాజకీయ దళారులు, లంచగొండి అధికారులు కూడా జనాలకు దాపురించారు. వీళ్లందరూ కరవులో అధికమాసం లాంటివారు. ఈ ఏడాది 'సూపర్ ఎల్ నినో' కారణంగా భారత్ సహా ఎనభై ఎనిమిది దేశాలు తీవ్ర వర్షాభావంతో అల్లాడనున్నాయి. ఇది కేవలం ప్రకృతి పరిణామం మాత్రమే కాదు, ఇంగితం లేని పాలకుల చర్యలకు పర్యవసానం కూడా! భూతాపం పెరుగుదలపై పర్యావరణవేత్తలు మొత్తుకుంటూనే ఉన్నా, కొందరు దేశ్యాధినేతలు యుద్ధ విధ్వంసాల్లో మునిగితేలుతున్నారు.

# ఆందోళనల వెనుకున్నది అధికార దాహమే!



వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమవుతున్నాయని ప్రభుత్వం నుంచి ప్రకటన రాగానే నిద్రాణమై ఉన్న భారత వ్యతిరేక అదృశ్య శక్తులు ఒక్కసారిగా మేల్కొన్నాయి. ఇప్పుడు ఢిల్లీలో నెలకొన్న పరిస్థితులు, వాటి వెనకున్న కారణాలను అన్వేషిస్తే విస్తుపోయే వాస్తవాలు బయటపడుతున్నాయి. ప్రభుత్వం పట్ల వ్యతిరేకతలు, భిన్నాభిప్రాయాలు కలిగి ఉండటం సహజం. భారతదేశం వంటి ఆదర్శ ప్రజాస్వామ్య రాజ్యంలో గతంలో ఎన్నో ఆందోళనలు జరిగాయి కానీ, ఇంత విద్వేషపూరితమైన, అసాధారణమైన పరిస్థితులు చూడటం బహుశా ఇదే మొదటిసారికావచ్చు. ఇవన్నీ చూస్తుంటే దేశంలో జరుగుతున్న అసహన రాజకీయాలు రూపుమార్చుకొని, అంతమొందించే రాజకీయాలుగా రూపాంతరం చెందాయన్న విషయం తెలుస్తోంది.

పక్కా ప్రణాళిక ప్రకారం విచ్ఛిన్నకర శక్తులు దేశంలో అలజడి సృష్టించడానికి ఎదురుచూస్తుండగా వచ్చిన ఈ అవకాశాన్ని దృష్టిలో పెట్టుకొని, అవి తమ దుశ్చర్యలకు రూపం కల్పించినట్టుగా ఈ ఆందోళన కనిపిస్తోంది. ఎన్నో ఏళ్లుగా అధికారం కోసం అర్రులు చాస్తూ వస్తున్న అవకాశవాద రాజకీయ నాయకులు తమ నిజస్వరూపాన్ని, ఈ దేశం పట్ల వారికున్న దురుద్దేశాన్ని, దేశ ప్రజల సంక్షేమం పట్ల వారికున్న నిర్లక్ష్య భావాన్ని నేడు బట్టబయలు చేస్తున్నారు.

ఇరవై ఆరు రోజులుగా నిరాహార దీక్ష చేసిన వాంగ్‌చుక్ గత చరిత్ర కూడా దేశ వ్యతిరేక కార్యకలాపాలతోనే ముడిపడి ఉంది. చైనాకు మద్దతుగా, పీఓకేను ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా పాకిస్థాన్‌లో కలపాలని వాదించిన వ్యక్తి. పర్యావరణ కార్యకర్తగా, విద్యావేత్తగా గుర్తింపు పొందిన వాంగ్‌చుక్ చేసినవన్నీ దేశ వ్యతిరేక కార్యకలాపాలే.

నిజంగా ఇది నీట్ కోసం జరిగిన ఉద్యమమే అయితే, అక్కడ నీట్ విద్యార్థులు కానీ, కనీసం వారి తల్లిదండ్రులు కానీ కనిపించలేదు. ఇప్పటివరకూ దేశంలో వందల పేపర్ లీకేజీలు జరిగాయి. అది వ్యవస్థలోని లోపాలను ప్రతిసారీ ఎత్తిచూపుతూనే ఉంది. అదీగాక, రీ--ఎగ్జామ్ జరిగి ఫలితాలు వచ్చిన తర్వాత, నిందితులను గుర్తించి అరెస్టు చేసిన తర్వాత కూడా ఆందోళనలు కొనసాగడం వెనుక వారి ఉద్దేశం ఏమిటి? అధికార దాహంతో వ్యవహరిస్తున్న శక్తులు తమ దుష్ట ఉద్దేశాలను అమలు చేయడానికి యువత బలహీనతలను అవకాశంగా మార్చుకుంటున్నాయి. శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్‌లో వలే ఇక్కడ కూడా అశాంతి సృష్టించేలా దేశద్రోహ కార్యక్రమాలు చేపట్టి, ప్రభుత్వంపై తిరుగుబాటు జరుగుతున్నట్లు చిత్రీకరించాలనే వారి కుట్ర బయటపడుతోంది. కాక్రోచ్ పార్టీ నాయకులు కొంతకాలం క్రితం జంతర్ మంతర్ వద్ద చేసిన వ్యాఖ్యలు కూడా ఇదే విషయాన్ని బహిర్గతం చేశాయి.

అంతేకాకుండా, ఆందోళనల సమయంలో మహిళల పట్ల అనుచిత ప్రవర్తన, అసభ్య వ్యాఖ్యలు చేయడం, మహిళా జర్నలిస్టులను దుర్భాషలాడడం వంటి ఘటనలు ఏ ఉద్యమానికీ సమర్థనీయమైనవి కావు. ఇంటర్నెట్‌ను నిలిపివేసిన పరిస్థితుల్లో కూడా మెసేజింగ్ యాప్‌ల ద్వారా ఆందోళనలకు రూపకల్పన చేయడం, నిఘా వర్గాలకు చిక్కకుండా హింసాత్మక చర్యలను నిర్వహించడం వంటి అంశాలను కూడా గమనించాల్సిన అవసరం ఉంది. ఇది ప్రేరేపిత ఉద్యమం కాకపోతే కేవలం జంతర్ మంతర్ వద్ద ఆందోళనలకు వచ్చినవారు.. భద్రతా దళాల కన్నుగప్పి ప్రధాని నివాసంపై దాడికి యత్నించడం, ఒక్కసారిగా ప్రతిపక్ష నాయకులు ప్రధాని నివాసానికి చేరుకుని ఆందోళన చేయటం రాజకీయ కుట్ర కాక మరేమిటి? అంతకు మూడు రోజుల ముందు అమెరికా వంటి దేశం తన పౌరులకు అడ్వైజరీ జారీ చేయడం గమనించాల్సిన విషయం. ఆందోళనకారులకు అవసరమైన నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయి? అనే విషయాన్ని కూడా కేంద్ర నిఘా సంస్థలు పరిశీలిస్తున్నాయి.

ప్రపంచంలోని కొన్ని దేశాలు తమ ఆధిపత్యాన్ని కొనసాగించడానికి భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. భారతదేశాన్ని అంతర్జాతీయంగా అస్థిరంగా చూపించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అలాగే, దేశంలో రాజకీయంగా బలపడలేని, ప్రజా మద్దతు లేని నాయకులు, 'అసహనం' పేరుతో గతంలో ఉద్యమాలు చేసినవారు, ఆపరేషన్ కగార్ ఆపి నక్సల్స్‌ను కాపాడాలని చర్చలు జరపాలన్నవారు, అవార్డులు వాపస్ ఇచ్చిన ప్రముఖులను ఇప్పుడు తమ డిమాండ్లకు మద్దతుగా నిలబెట్టే ప్రయత్నం చేయడం రాజకీయ అసహనం కాక మరేమిటి? అలాంటి రాజకీయ పార్టీలు నేటి ఆందోళనకారులకు తోడవడం వారి ఉద్దేశాలను బట్టబయలు చేసింది. అక్కడకు వచ్చిన యువత సహజంగా వచ్చినవారు కాదు; వివిధ రాజకీయ పార్టీలు పంపిన పెయిడ్ బ్యాచ్‌లుగా కనిపించారు. అక్కడ ఉన్న మీడియా ప్రతినిధులపై కూడా దాడులు చేశారు. పోలీసులపై, సాయుధ బలగాలపై చెలరేగి, వారిని రెచ్చగొట్టి లాఠీచార్జికి ప్రేరేపించే ప్రయత్నం జరిగింది. గతంలో హైదరాబాద్‌లో జరిగిన రోహిత్ వేముల ఆత్మహత్య ఘటనను జాతీయ సమస్యగా చిత్రీకరించినట్లుగానే, ఇక్కడ కూడా ప్రతిపక్ష పార్టీలు అన్నీ ఒక్కటై ఆ మంటల్లో చలి కాచుకునే ప్రయత్నం చేశాయి. ఇప్పటికీ తెలంగాణలో నక్సల్ సానుభూతిపరులకు, అర్బన్ నక్సల్స్‌కు ప్రభుత్వం ప్రత్యక్షంగా ఆశ్రయం ఇస్తూ, సమయం వచ్చినప్పుడు వారిని రాజకీయ దాడులకు వాడుకుంటోంది. విదేశాల్లో పుట్టిన కాక్రోచ్ పార్టీ... ప్రతిపక్షాలతో చేరి, తమకున్న అంతర్జాతీయ నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుంటూ, మోదీ ప్రభుత్వాన్ని కూల్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. కేంద్ర మంత్రులు పార్లమెంట్ వేదికగా చర్చకు అంగీకరించారు. కానీ, చర్చలో పాల్గొనకుండా తమ విధ్వంసక చర్యలను కొనసాగించడానికి మొగ్గు చూపిన కాక్రోచ్ పార్టీ అంతరంగం అర్థమవుతోంది. ప్రధాని మోదీ ఈ పేపర్ లీకేజీ విషయాన్ని సీరియస్‌గా తీసుకొని, ఇప్పటికే సంబంధిత మంత్రులతో చర్చించారు. ఈ విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని చెప్పారు. పేపర్ లీకేజీల విషయంలో ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ జరిపించి, వేగంగా శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని కూడా ప్రకటించారు.

బలహీనమైన దేశాలైన శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్లో జరిగిన హింసాత్మక పరిణామాలను భారతదేశంలో కూడా పునరావృతం చేయాలనే కుట్రలు ఎప్పటికీ విజయవంతం కావు. చైతన్యవంతమైన భారత యువత ఇవన్నీ గమనిస్తూనే ఉంది. గోరంతను కొండంతగా చూపిస్తూ యువతను, విద్యార్థులను రెచ్చగొట్టే రాజకీయాలను దేశం సహించదు. సమయం వచ్చినప్పుడు ఈ దేశ యువత ప్రతిపక్షాలకు తప్పక సమాధానం ఇస్తుంది.

# ఈ కుట్ర సిద్ధాంతాలకు కాలం చెల్లింది!

ఢిల్లీ అధికార కారిడార్లలో కుట్ర సిద్ధాంతాలు నిరంతరం వినిపిస్తూనే ఉంటాయి. నేటి రాజకీయ భారతంలో అవి గుసగుసల కంటే బిగ్గరగా వినిపిస్తున్నాయి. ఇప్పుడు అవి రాజకీయ ఆయుధాలుగా పరిణమించాయి. దేశ రాజధానిని కుదిపేసిన విద్యార్థుల నిరసనలతో సంబంధమున్న సోనమ్ వాంగ్‌చుక్, కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) సభ్యులు తాజా కుట్ర సిద్ధాంతాలకు లక్ష్యాలుగా ఉన్నారు. ప్రశ్నపత్రాల లీక్‌లు, తగ్గిపోతున్న ఉద్యోగావకాశాలు, నియామకాల్లో జాప్యాలపై లక్షలాది యువ భారతీయులు ఎందుకంతగా ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారో అర్థం చేసుకోకుండా, వారి ఆందోళనలకు నాయకత్వం వహిస్తున్నవారి ఉద్దేశాలను ప్రశ్నించేందుకే రాజకీయ పార్టీలు ప్రాధాన్యమిస్తున్నాయి.

వాంగ్‌చుక్, సీజేపీలు మోదీ ప్రభుత్వ 'రహస్య రాజ్య వ్యవస్థ' (డీప్ స్టేట్)లో భాగమే అని కాంగ్రెస్ శ్రేణుల్లో బాగా ప్రచారంలో ఉన్న ఒక సిద్ధాంతం చెబుతోంది. 'నీట్' పరీక్షల గందరగోళంపై ప్రజ్వరిల్లిన ఆందోళనల నుంచి రాజకీయలబ్ధి పొందకుండా కాంగ్రెస్‌ను నివారించేందుకే వాంగ్‌చుక్, సీజేపీని మోదీ సర్కార్ 'డీప్ స్టేట్' రంగంలోకి దించిందనేది ఆ సిద్ధాంత సారాంశం. ఇదొక అసాధారణ వాదన. దీనికి సాక్ష్యాధారాలు ఏవీ లేవు. అయితే వాస్తవాల కంటే అనుమానాలే మహా వేగంగా విస్తరిల్లి, వర్ధిల్లే వర్తమాన యుగంలో కుట్ర సిద్ధాంతాల శీఘ్రగతిన బాగా ప్రభావదాయకమవుతున్నాయి. లద్దాఖ్‌కు మరింత స్వతంత్ర ప్రతిపత్తి నివ్వాలని డిమాండ్ చేస్తూ ఆ హిమాలయ ప్రాంతవాసులు ఏడాది క్రితం నిర్వహించిన ఆందోళనలో హింసాత్మక ఘటనలు సంభవించాయి. వాటికి సోనమ్ వాంగ్‌చుక్ బాధ్యుడు అనే ఆరోపణతో ఆయనను జాతీయ భద్రతా చట్టం కింద అరెస్ట్ చేశారు. ఆరు నెలలపాటు జైలు నిర్బంధంలో ఉన్న తరువాత విడుదల చేశారు. అరెస్ట్ చేయడానికి కారణాలు ఏమిటో ప్రభుత్వం చెప్పనే లేదు. వాంగ్‌చుక్ జైలులో ఉన్న సమయంలో బీజేపీ సామాజిక మాధ్యమాలలో ఆయనను విదేశీ నిధులు పొందుతున్న 'జాతి వ్యతిరేకి'గా చిత్రించారు. 'చైనా ఏజెంట్' అని కూడా ఆరోపించారు. తమ రాజకీయ కథనాలను సమర్థించుకోవడానికై వాంగ్‌చుక్ ఉపన్యాసాల నుంచి ఎంపిక చేసిన మాటలను ఉల్లేఖించారు. ఇప్పుడు అదే వ్యక్తిని ఇంటెలిజెన్స్ బ్యూరో చేతుల్లో కీలుబొమ్మ అని కాంగ్రెస్ శ్రేణులు నిందిస్తున్నాయి. మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ చేస్తున్న పోరాటం, రాహుల్‌గాంధీ నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు వాంగ్‌చుక్‌ను ఉపయోగించుకుంటున్నారని ప్రధాన ప్రతిపక్షం ఆరోపిస్తోంది. 'చైనా ఏజెంట్‌గా ఆరోపణలకు గురైన వ్యక్తి భారత ప్రభుత్వ ఏజెంట్‌గా ఎలా పరిణమించాడు? తమ నీడను చూసి జడుసుకునే రాజకీయవాదుల భయానుమానాలలోని అసంబద్ధతను వాంగ్‌చుక్‌పై ఈ నిందలు బహిర్గతం చేస్తున్నాయి.

వాంగ్‌చుక్ నాకు రెండు దశాబ్దాలుగా తెలుసు. విద్యారంగం, పర్యావరణ పరిరక్షణలో ప్రశస్త కృషికి గాను 2008లో సీఎన్ఎన్--ఐబీఎన్ వార్తా సంస్థ వాంగ్‌చుక్‌ను 'రియల్ హీరో'గా గౌరవించి సత్కరించిన సందర్భంలో నేను ఆయనను మొదటిసారి కలుసుకున్నాను. ఆనాటి సభలో నటుడు ఆమిర్‌ఖాన్ కూడా ఉన్నారు. ఆ తరువాత ఆయన నటించిన 'త్రీ ఇడియట్స్' సినిమా వాంగ్‌చుక్ జీవితం నుంచి స్ఫూర్తి పొందినట్టుగా ప్రచారం జరిగింది. విద్యారంగంలో మౌలిక మార్పులకు, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల పరిపూర్తికి, లద్దాఖ్ భవిష్యత్తుకు వాంగ్‌చుక్ చేస్తున్న కృషిని నేను చాలా సంవత్సరాలుగా గమనిస్తూ వస్తున్నాను. వాంగ్‌చుక్ ప్రతిష్ఠాత్మక రామన్ మెగసెసే అవార్డు గ్రహీత. గతంలో అన్ని రాజకీయ పార్టీలు సమున్నతంగా గౌరవించిన వ్యక్తి, ఇప్పుడు ఎవరు మాట్లాడుతున్నారు అన్నదానిపై ఆధారపడి ఆయన దేశద్రోహిగానో లేక ప్రభుత్వ ఏజెంట్‌గానో ఎలా అయ్యారు? మోదీ ప్రభుత్వం సైతం ఆయనను పలుమార్లు బహిరంగంగా ప్రశంసించింది. మార్చి 2023లో వాంగ్‌చుక్, ఆయన సతీమణితో సమావేశమైన తరువాత వారితో తాను దిగిన ఫొటో నొకదాన్ని ధర్మేంద్ర ప్రధాన్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు, వివిధ రంగాలలో ఆ దంపతులు చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. మూడు సంవత్సరాల తరువాత నీట్ వివాదంలో ప్రభుత్వాన్ని నిలదీసినందుకుగాను వాంగ్‌చుక్‌పై బీజేపీ నాయకుల గౌరవాభిమానాలు పూర్తిగా తుడిచిపెట్టుకు పోయాయి. వాంగ్‌చుక్ లేవనెత్తిన ప్రశ్నలపై చర్చించడానికి బదులుగా ఆయన ఉద్దేశాలను అనుమానిస్తున్నారు. మరొక ఉదంతాన్ని కూడా ప్రస్తావించవలసి ఉన్నది. 'లేహ్ అటానమస్ డెవలప్‌మెంట్ కౌన్సిల్' వాంగ్‌చుక్ ఆధ్వర్యంలోని హిమాలయన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్‌నేటివ్స్'కు 1000 కనాల్స్ (8 కనాల్‌లు ఒక ఎకరానికి సమానం) భూమిని కౌలుకు ఇచ్చింది. ఆ తరువాత ఆ కౌలును రద్దు చేసింది. లద్దాఖ్ స్వతంత్ర ప్రతిపత్తి ఉద్యమంలో వాంగ్‌చుక్ కీలకపాత్ర వహిస్తున్న కారణంగానే ఈ రద్దు జరిగిందన్నది స్పష్టం. భిన్నాభిప్రాయ వ్యక్తీకరణను ప్రజాస్వామిక స్వేచ్ఛగా కాకుండా ఒక విరోధ చర్యగా పరిగణించడం వల్లే ఇలా జరిగింది. ప్రభుత్వ నిర్ణయాలతో విభేదించినవారు బెదిరింపులు, వ్యక్తిత్వ హననాలకు గురవుతున్నారు. మోదీ ప్రభుత్వం మొదటి నుంచీ ఇలానే వ్యవహరిస్తోంది. పాత్రికేయులు, విద్యావేత్తలు, పౌర సమాజ కార్యకర్తలు అందరూ ఈ ప్రభుత్వ ఆగ్రహానికి గురవుతూనే ఉన్నారు.

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)ని మోదీ సర్కార్ తొలుత నెలలపాటు పూర్తిగా ఉపేక్షించింది. సీజేపీ కార్యకర్తల నిరసన ఉధృతమైన తరువాతనే దాని ఉనికిని అంగీకరించడం సర్కార్‌కు అనివార్యమయింది. కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే, సీజేపీ అనేది ఆమ్ ఆద్మీ పార్టీకి ఒక పరోక్ష ప్రతినిధి మాత్రమే. కారణం దాని స్థాపకుడు అభిజిత్ దీప్కే గతంలో ఆప్ సోషల్ మీడియాలో పనిచేయడమే! 2011లో అన్నాహజారే ఉద్యమం నుంచే ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రభవించి, యూపీఏ ప్రభుత్వ పతనాన్ని వేగవంతం చేసిన చరిత్ర కాంగ్రెస్‌ను ఇప్పటికీ బాధిస్తూనే ఉన్నది. అయితే చరిత్ర ఒక బందీఖానా కాకూడదన్న వివేకాన్ని చూపకపోతే ఎలా?

సీజేపీ కార్యకర్తలు పలువురితో నేను సంభాషించాను. పార్టీ రాజకీయాలు కాకుండా వ్యవస్థ పట్ల అసంతృప్తే వారి తిరుగుబాటుకు ప్రేరణ. ఈ 'జనతా' వాదులు అనుభవ శూన్యులు, అయితే.. ఆదర్శవాదులు. అప్పుడప్పుడు అవ్యవస్థితులు, అయితే.. కపటరహిత రాజకీయులు. తాము ఎందుకు ఈ ఆందోళనకు పూనుకున్నామని వారు నిర్మొహమాటంగా చెబుతున్నదాన్ని వినడం కంటే-- ఏదో ఒక రాజకీయ పార్టీ ఏజెంట్లు అని కొట్టివేయడం చాలా తేలిక. అసలు ఈ నిర్లక్ష్య వైఖరే ఒక పెద్ద విషాదం. పన్నెండు సంవత్సరాలుగా అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణను సహించలేకపోతోంది. అసమ్మతిని పరిగణనలోకి తీసుకోవల్సిన అవసరం లేదని లేదా దానిని అణచివేయవచ్చని విశ్వసిస్తోంది. విమర్శకులను విరోధులుగా, నిరసనకారులను కుట్రదారులుగా చూస్తోంది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రధానమంత్రిని బలహీనపరిచేందుకు విదేశీ శక్తులతో కుమ్మక్కయినవారు చేస్తోన్న మరో ప్రయత్నమే సీజేపీ అని ప్రభుత్వం భావిస్తోంది. తమ సమస్యల పరిష్కారానికి ఆందోళన చేస్తున్న యువతపై రాజకీయ నిందారోపణలు చేయడం రాజకీయపక్షాలకు తగదు. కుట్రసిద్ధాంతాలలో పావులుగా వారిని పరిగణించకూడదు. అంతకంటే మెరుగైన విషయాలకు యువ భారతీయులు అర్హులు. ప్రశ్న పత్రాల లీక్‌కు కారణాలు ఏమిటో వారికి స్పష్టంగా వివరించాలి. ఉద్యోగ నియామకాల్లో జాప్యం ఎందుకు జరుగుతుందో చెప్పాలి. క్షీణిస్తున్న విద్యా ప్రమాణాలను ఎలా మెరుగుపరచనున్నారో స్పష్టంచేయాలి. తగ్గిపోతున్న ఉద్యోగావకాశాల విషయమై సంజాయిషీ చెప్పాలి. తమ ఆకాంక్షలను వినే ప్రభుత్వాలు, తమకు నాయకత్వం వహించే ప్రతిపక్షాలు యువభారతీయులకు అవసరం.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881